# చిత్ర కదంబం

## సినీ బతాణీలు

### ఏరుకొచ్చినవారు - సినీజ్ఞా నానందమహర్షి

#### 'ప్రేమలేఖలు' లో తెలుగు మాట్లాడిన హిందీ తారలు






1950లో రాజ్ కపూర్ తన సొంత బేనర్ 'ఆర్.కె. ' మీద 'ప్రేమలేఖలు' అనే తెలుగు చిత్రాన్ని నిర్మించారు. దీన్ని హిందీలో 'ఆహ్' పేరుతోనూ, తమిళంలో 'ఆవణ్' పేరుతోనూ నిర్మించారు. అన్ని భాషల్లోనూ 'ఆహ్' చిత్రంలో నటించిన హిందీ నటులే. మూడు భాషల చిత్ర నిర్మాణం ఒకే సారి జరిగినా ముందుగా విడుదలైంది మాత్రం తెలుగు 'ప్రేమలేఖలు' చిత్రమే. అన్ని భాషల్లోనూ హిందీ నటీ నటులే తమ సొంత గొంతుతో డబ్బింగ్ చెప్పారు..! అదీ రాజ్ కపూర్ సహజత్వం కోసం పడిన తపన, చిత్ర నిర్మాణంలో ఆయన చూపిన నిబద్ధత..!

#### ఇంటా, బయటా గెలిచిన నట శేఖరుడు ఎస్వీఆర్.



తెలుగు భాషా నటీమణులు చాలా మంది తమిళ చిత్రాల్లో కూడా నటించి పేరు తెచ్చుకున్నారు, దశాబ్దాలక్రితమే. (ఇప్పుడు చెప్పుకునేది 30-40 సంవత్సరాల క్రిందటి సంగతి). ఐతే అప్పట్లో తమిళంలో పేరు తెచ్చుకున్న తెలుగు నటులు మాత్రం చాలా కొద్ది మందే వారిలో కొందరు చిత్తూరు నాగయ్య, ఎస్వీ రంగారావు గార్లు.

ఎస్వీ రంగారావు గారు తమిళ చిత్రరంగంలో కూడా తెలుగు సినీ రంగంలో సంపాదించినంతటి కీర్తిని ఆర్జించారు. 'రంగారావు గారు తమ చిత్రాల్లో ఉంటే చిత్రం విజయం ఖాయం ' అని గట్టి నమ్మకం ఉండేది ఆ రోజుల్లో తమిళ నిర్మాతలకు. ఆయన నటించిన 'అన్నై',' శారద','నామం ఒరుప్పెణ్','కర్పగం' లాంటి చిత్రాలకు అవార్డులు వచ్చాయి. 1960లో 'పడిక్కాచ మేదై' (తెలుగులో ఆత్మబంధువు) చిత్రంలో ఆయన నటనకి మద్రాస్ ఫిలిమ్ ఫాన్స్ వారి 'ఉత్తమ నటశిఖామణి' బిరుదు వచ్చింది.

## హిందీనటి-తెలుగు గాయని



రెబెల్ స్టార్ కృష్ణం రాజు గారి మొదటి చిత్రం 'చిలకా గోరింక'. ప్రత్యగాత్మ దర్శకత్వంలో తయారైన ఈ సినిమా 1966లో విడుదలైంది. దీనిలో అప్పటి ప్రముఖ హిందీ నటి నూతన్ నటించడమే కాక ఒక తెలుగు పాటని కూడా పాడారా చిత్రంలో.

## శ్రీశ్రీ చిన్నప్పటి సినీ సరదాలు



నా సినిమా సరదాలు చిన్నపుడే అనగా పది పన్నెండేళ్ళ వయసులో (సూచన: శ్రీశ్రీ జన్మించింది 1910లో) ప్రారంభం అయ్యాయి. ఆ రోజుల్లో విశాఖపట్నం లైట్ హవుసు దగ్గర ఒక గుడారంలో జోస్ ఎలెక్ట్రిక్ బయస్కోప్ అనే కంపెనీ ఆడుతూ ఉండేది. కుర్చీ, బెంచీ, నేల అనే తర తమ బేధాలు లేవక్కడ. అణా టిక్కెట్టు తీసుకుంటే ఎక్కడైనా కూర్చోవచ్చు, ఇసుకలో! చీకట్లో తెరమీద బొమ్మలు కదుల్తూ ఉంటే, దాని కనుగుణ్యంగా ఏదో ఒక మూలనుంచీ వాద్య సంగీతం (తరచూ హార్మోనియం నుంచీ) వినిపిస్తూ ఉంటే మా పిల్లలకది సరదాగా అనిపించేది. అప్పటికింకా అది పెద్ద కళగాని, వ్యాపారం గానీ కాలేదు. చూసేది చిన్న పిల్లలు, చేసేది చిన్న తరహా వ్యాపారం. ఆ రోజుల్లో సినీమా అనే మాట కూడా చెలమణీలోకి రాలేదు. మేం బయస్కోపు చూసేవాళ్ళం కానీ , సినీమాకు వెళ్ళేవాళ్ళం కాదు. (శ్రీశ్రీ ఆత్మకథ 'అనంతం' నుంచీ)

## ఈ పాటలెలా పుట్టాయంటే..





వేటూరి గారు, విశ్వనాథ్ గారూ 'సీతామాలక్ష్మి' నిర్మాణ సమయంలో ఒక సన్నివేశంలో పాట గురించి చర్చిస్తున్నారు. అక్కడ ఎలాంటి పాట ఉండాలో, ఎంత డెప్త్ ఉండాలా అని చాలా సేపు చర్చించారు. ఎంత సేపైనా ఒక కొలిక్కి రాలేకపోయారు. వేటూరి గారు.." ఏపాట నేరాయను.. బ్రతుకే పాటైన పసివాడను.." అని తన బాధని విశ్వనాథ్ గారితో వెళ్ళ బోసుకున్నారు.. అంతే విశ్వనాథ్ గారు.."ఐపోయిందిగా అదే పాట..రాసెయ్యండి.." అంటూ వేటూరి మామూలుగా అన్న మాటలనే పాటగా వ్రాయించేసారు. ఐతే సినిమాలో చిన్న పిల్లవాడు పాడుతాడు కాబట్టి 'రాయను' అనే మాటకు బదులు 'పాడను' అని మార్చారు. ఇలాంటిదే మరో సంఘటన ఆత్రేయ గారి గురించి చెబుతారు. ఆయన పాటలు వ్రాసేందుకు చాలా సమయం తీసుకుంటారనేది జగమెరిగిన సత్యం. 'తాసిల్దారు గారమ్మాయి' సినిమాలో ఒక పాటకోసం అసిస్టెంటు డైరెక్టర్ ఆత్రేయ గారి చుట్టూరా తిరిగి తిరిగి అలిసిపోయాట్ట. చివరికోరోజు..' బాబూ..అసలు సినేమిటో చెప్పు' అన్నారట ఆత్రేయ గారు.." పెళ్ళికూతురుకి

పాడాలని ఉండదు..కానీ పెద్దల బలవంతం వల్ల పెళ్ళి చూపుల్లో పాడల్సి ఉంటుంది. ఏదో వాళ్ళున్నారని పాడుతుందంతే.." అని సీన్ వివరించాడతను. అయితే రాసుకో.." పాడమన్నావు..పాడుతున్నాను.." అంటూ అక్కడికక్కడే పాట డిక్టేట్ చేసి పంపించారట..

నాగయ్యగారి పోతన



తెలుగు చలన చిత్ర సీమలో ఒక వెలుగు వెలిగి చివరిదశలో దయనీయమైన జీవితాన్ని గడిపిన చిత్తూరు నాగయ్య గారు సృష్టించిన రికార్డులు, అందుకున్న సన్మానాలు లెక్కనేనన్ని ఉన్నాయి. ఆయన నటించిన 'పోతన'(1943) సినిమా చూసి అప్పటి ప్రముఖ హాస్యనటుడు ఎస్.ఎస్.కృష్ణన్ (వీరి విగ్రహం మద్రాసులో వాణీ మహల్ వద్ద వుంది) ఒక రోజు వెండి నాణేలతో, వెండి పళ్ళెంలో నాగయ్య గారి వద్దకొచ్చి దండం పెట్టి 'అయ్యా..నేను నాస్తికుడ్ని. కానీ పోతన చిత్రంలోని మీ పాత్రలో నేను దైవత్వాన్ని చూసాను..' అన్నారు.. అలానే పిఠాపురం మహరాజా గారు నాగయ్య గారి 'పోతన' సినిమా చూసి లక్ష రూపాయలు చెక్కు ఇచ్చారు..( ఈ రోజుల్లో అది ఎన్ని కోట్లో!).

## ఈ గీతమూ..ఇది ఏ రాగమో..!.

### అభేరి రాగం

| పాట | చిత్రం,గానం,సంగీతం |
|---|---|
| రాగమయీ రావే | (జయభేరి, ఘంటసాల, పెండ్యాల) |
| ఓ నెలరాజా..వెన్నెల రాజా నీ వన్నెలన్ని చిన్నెలన్ని | (భట్టివిక్రమార్క, ఘంటసాల, సుశీల, పెండ్యాల) |
| చల్లగ రావేల | (భలేరాముడు, ఘంటసాల, లీల, ఎస్.రాజేశ్వర రావు) |
| పదిమందిలో పాటపాడినా | (ఆనంద నిలయం, ఘంటసాల, పెండ్యాల) |

## దర్బారీ కానడ రాగం

| పాట | చిత్రం,గానం,సంగీతం |
|---|---|
| నమోభూతనాథా | (సత్యహరిశ్చంద్ర ఘంటసాల, ఎస్.వరలక్ష్మి, పెండ్యాల) |
| శివశంకరీ శివానందలహరి | (జగదేకవీరుని కథ, ఘంటసాల, పెండ్యాల) |
| శ్రీనగజాతనయం సహృదయం (పల్లవిమాత్రం) | (వాగ్దానం, ఘంటసాల, పెండ్యాల) |

## కాపీ రాగం

| పాట | చిత్రం,గానం,సంగీతం |
|---|---|
| పిలిచిన బిగువటరా | (మల్లీశ్వరి, భానుమతి, ఎస్.రాజేశ్వరరావు) |
| నా చెలిరోజావే | (రోజా, బాలు,సుజాత ఎ.ఆర్.రెహ్మాన్) |
| వద్దురా కన్నయ్యా.. | (అర్ధాంగి, జిక్కి, భీమవరపు నరసింహారావు) |
| అందాలబొమ్మతో | (అమరశిల్పి జక్కన్న, సుశీల, ఎస్.రాజేశ్వర రావు) |

*అంతగా ప్రజాదరణ పొందని సినిమాల్లో ఆత్రేయ రాసిన పాటల్లోని మంచి వాక్యాలు*



పరులు నిన్నేమి చేయ బాధకలుగును
అది పరులకు నువ్వు చేయకుండుటే పరమధర్మము
మంచినే తలపోయుచు మంచికే జీవించుచు
పరులమంచిని కోరే మనసే దేవాలయము..
(మంచి మనిషి , 1983)

మనిషికోసం బ్రతికే మనిషే దేవుడు
దేవుడి కోసం మనిషిని మరిచేవాడే మూఢుడు
ప్రేమ ..త్యాగం తెలిసిన వాడే మానవుడు

దేవుడి పేరిట మూఢుడైతే వాడే దానవుడు
(మేమూ మనుష్యులమే , 1983)

ప్రేమకు పునాది నమ్మకము
అది నదీ సాగర సంగమము
కడలికి ఎన్నో నదుల బంధము
మనిషికి ఒకటే హృదయము
అది వెలిగించే ప్రమిదలాంటిది
వలచినప్పుడే వెలిగేది
(అభిమన్యుడు , 1984)



గువ్వకు ఒకటే గూడుంటుంది
గుండెకు ఒకటే తోడుంటుంది
రెక్కలు గువ్వను కోర్కెలు గుండెను
ఎక్కడ వున్నా ఏకం చేయును
(మానసవీణ , 1984)

నేడు నిన్నౌతుంది- రేపు నేడౌతుంది
రేపు కూడ నిన్నగా మారుతుంది
కాలం దేన్నిరా పాపమని ఆపుతుంది
పోయినోళ్ళకోసం పోబోయే నువ్వు
ఏడ్చేది తలుసుకుంటే నవ్వొస్తుంది
ఆత్మనేది చావదంట - అసలాత్మంటే ఏమిటంట
మనసంట - మనసులోని మంచంట
మంచి మనసు పెంచుకున్న ప్రేమంట
ప్రేమే ఆత్మంట - ఆత్మే ప్రేమంట
(శాంతినివాస్ , 1984)



****